క్లుప్తంగా

టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఉప్పల్: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే తెలుగుదేశం తెలంగాణ ప్రతినిధుల సమావేశం జరుగుతుందని మల్కాజిగిరి పార్లమెంట్ అధ్యక్షుడు కందికంటి అశోక్ కుమార్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

కార్పొరేటర్‌కు బీఎల్ఆర్ పరామర్శ



కార్పొరేటర్ స్వర్ణరాజ్‌ను పరామర్శిస్తున్న బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: అనారోగ్యంతో బాధపడుతున్న కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణిని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం రెండ్రోజుల క్రితం డిశ్చార్జ్ అయ్యారు. బీఎల్ఆర్‌తో పాటు బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధి ఖైరి నవీన్‌గౌడ్, కాప్రా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సూడుగు మహేందర్‌రెడ్డి, నాయకులు పాండుగౌడ్, భాస్కర్‌గౌడ్, రవీందర్‌రావు, సికిందర్ తదితరులున్నారు.

కంటి సమస్యల పరిష్కారానికి చక్కని మార్గం



కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అజయ్ యాదవ్

బోడుప్పల్: డివిజన్ పరిధిలోని ప్రతి ఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని 6వ డివిజన్ కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ 6వ డివిజన్ పరిధిలోని నార్త్ అశోక్‌నగర్‌లో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వ నివారణకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజల కంటి సమస్యలు తీర్చే చక్కని మార్గం కంటి వెలుగు అన్నారు. కార్యక్రమంలో అమరేందర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు దేవాదాయశాఖ అధికారి వెంకన్న పర్యవేక్షణలో మంగళవారం కొనసాగింది. 48 రోజుల హుండీ లెక్కింపు ద్వారా రూ.1,73,119 ఆదాయం, 8.580 గ్రాముల బంగారం వచ్చిందని ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో అర్చకులు వేంకటరమణాచార్యులు, తులసిరమణాచార్యులు, పూర్వ కమిటీ చైర్మన్లు ఉమేష్ సింగ్, సంతోష్, రవీందర్‌రెడ్డి, సుధాకర్, జయశ్రీ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో శ్రద్ధ చూపాలి

అల్వాల్: ప్రతి ఒక్కరూ పారిశుధ్య నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితకిషోర్ అన్నారు. మంగళవారం రాజీవ్‌నగర్, ఇందిరానగర్‌లో చేపట్టిన మాస్ క్లీనింగ్ డ్రైవ్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాస్ క్లీనింగ్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబితకిషోర్

ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి



- జీఓ 58 పట్టాల పంపిణీలో మంత్రి మల్లారెడ్డి
- 335 మందికి పట్టాల అందజేత

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న నిరుపేదల స్థలాలను జీఓ-58 కింద క్రమబద్ధీకరించి మంగళవారం 335 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను రాష్ట్ర కార్మికశాఖ, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న నిరుపేదలకు జీఓ-58 ప్రకారం క్రమబద్ధీకరించి భరోసా కల్పించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అన్నారు. ప్రతి కుటుంబంలో సంతోషాన్ని నింపే సంక్షేమ పథకాలతో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ కీసర, మేడిపల్లి తహసీల్దార్ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, జంట కార్పొరేషన్ల కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పట్టాల పంపిణీలో అవకతవకలు: బీజేపీ

మేడిపల్లి. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బండి గార్డెన్స్‌లో ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మల్లారెడ్డి జీఓ.58 పట్టాలను పంపిణీ చేశారు. ఈ సమయంలో పెద్దఎత్తున బీజేపీ నేతలు హాజరై నిరసన తెలిపారు. కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలు, కొంతమంది అనుచరులకు మాత్రమే పట్టాలను పంచుతున్నారని, అర్హులైన వారికి పట్టాలు అందజేయాలని డిమాండ్ చేశారు. దీంతో వారిని మేడిపల్లి పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీజేపీ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు నమిలికొండ అనిల్‌రెడ్డి, మద్దురి చిత్తరంజన్, సుజాత, జైపాల్ రెడ్డి, కరుణాకర్, ఏనుగు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై కఠిన చర్యలు



శ్రీధర్ ప్రసాద్, కాప్రా సర్కిల్, అసిస్టెంట్ సిటీ ప్లానర్

కాప్రా: ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాప్రా సర్కిల్ అసిస్టెంట్ టౌన్ ప్లానర్(ఏసీపీ) శ్రీధర్ ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి, మీర్‌పేట్‌హెచ్‌బీకాలనీ, నాచారం, మల్లాపూర్ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించినట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. మొదట మైక్ ద్వారా హెచ్చరించి, తదుపరి నిబంధనల ప్రకారం చర్యలు చేపడతామన్నారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసు విభాగాల సహకారంతో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించనున్నట్లు పేర్కొన్నారు. ఇక మరోవైపు నగరంలో అక్కడక్కడా జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని సర్కిల్ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్, మాల్స్‌పై దృష్టి సారించామన్నారు. సర్కిల్ పరిధిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగానే తమ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. సెల్లార్లలో ఎలాంటి వ్యాపారాలు నిర్వహించకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

‘ప్రజల ఆరోగ్యం పట్ల ఎంటమాలజి నిర్లక్ష్యం’



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సఫిల్‌గూడ చెరువులో గుర్రపు డెక్క తొలగింపుతో పాటు దోమల నివారణ పనులు వేగవంతం చేయాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఎంటమాలజీ అధికారులకు సూచించారు. మంగళవారం పనులను చీఫ్ ఎంటమాలజిస్ట్ దుర్గాప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ పనులు చేసేందుకు రూ.18 లక్షలు కేటాయించినప్పటికీ నత్తనడకన సాగుతున్నాయని, ఇటీవల సిబ్బంది పనితీరు బాగాలేదని సమీక్ష ద్వారా ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ఎంటమాలజి విభాగానికి ఎలాంటి శ్రద్ధ లేకుండా పోయిందని, తీరుమారకపోతే గ్రేటర్ కమిషనర్, మేయర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

అందరి సహకారంతోనే స్వచ్ఛత



ఉప్పల్ దేవేందర్‌నగర్‌లో మాట్లాడుతున్న డీసీ అరుణకుమారి, డీఈ చందన

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఉప్పల్ సర్కిల్ డీసీ అరుణ కుమారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేవేందర్‌నగర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో రాంకీ, జీహెచ్‌ఎంసీ స్వచ్ఛ సేవకులు, శానిటేషన్ సిబ్బందితో కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తడిపొడి చెత్తను స్వచ్ఛ ఆటోల వారికి విడివిడిగా అందివ్వాలని, అదేవిధంగా స్వచ్ఛ సేవకులు కూడా వేర్వేరుగా తీసుకునే విధంగా ఆటోలో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. హానికర వ్యర్థాలకు ఆటోలో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తను పడేయవద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లలోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని, ప్రజల సహకారంతోనే స్వచ్ఛత సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఈ చందన, శానిటేషన్ సూపర్‌వైజర్లు సుదర్శన్, రాజేశ్వర్‌రెడ్డి, జవాన్లు, ఎస్ఎఫ్ఐలు, రాంకీ సంస్థ ప్రతినిధులు దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి కంటి పరీక్షలు



సీపీ కార్యాలయంలో కంటి వెలుగును పరిశీలిస్తున్న కమిషనర్ డీఎస్ చౌహాన్

అల్వాల్: నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ డీఎస్.చౌహాన్ మాట్లాడుతూ రాచకొండ పోలీస్ అధికారులు, ఇతర సిబ్బంది సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలోనూ సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారని గుర్తుచేశారు. సిబ్బంది సంక్షేమం కోసం భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మల్కాజిగిరి డీసీపీ జానకి, అడ్మిన్ డీసీపీ ఇందిర, డాక్టర్ అచ్చుత్‌రావు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ప్రశ్నించినందుకే అనర్హత వేటు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నందికంటి శ్రీధర్



సత్యాగ్రహ దీక్షలో కాంగ్రెస్ నేతలు

మల్కాజిగిరి: ప్రభుత్వాన్ని, మోదీ పనితీరును ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేశారని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. మల్కాజిగిరి చౌరస్తాలో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం సత్యాగ్రహ దీక్ష జరిగింది. నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ మోదీ పాలన, ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావడంతో మోదీ, అమిత్‌షాలు స్థిమితంగా ఉండలేకపోతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు రాహుల్ గాంధీకి అండగా ఉన్నాయని, భవిష్యత్‌లో మోదీ ప్రభుత్వంపై పోరాటం తీవ్రతరం చేస్తామన్నారు. ధర్నాలో శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌యాదవ్, పోల్కం వెంకటేష్, జీవన్‌రెడ్డి, గుత్తి రాంచందర్, ఉమేష్‌సింగ్, శంకర్, వినోద్‌యాదవ్, యాదగిరి, ఆశ, రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని వేధిస్తే ఆందోళనలు

రామంతాపూర్: రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసినందుకు రామంతాపూర్ ప్రధాన రహదారిలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద మంగళవారం నిరసనగా చేపట్టారు. నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, బీ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కార్యకర్తలు, నేతలతో సత్యాగ్రహ మౌనదీక్షను నిర్వహించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల రాహుల్ గాంధీ నిర్వహించిన జోడో యాత్ర విజయవంతం కావడాన్ని బీజేపీ ప్రభుత్వం జీర్ణించుకోలేక కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు పసూల ప్రభాకర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రఫీక్, సుధాకర్‌శెట్టి, నవీన్, సంజయ్, అనిల్ పాల్గొన్నారు.

ఇద్దరు చైన్ స్నాచర్స్ రిమాండ్



చోరీ వస్తువులను చూపుతున్న ఏసీపీ నరేష్‌రెడ్డి, సీఐలు గోవింద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు

ఉప్పల్: జల్సాలకు అలవాటుపడ్డ ఇద్దరు బాల్య స్నేహితులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ మేరకు ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి ఏసీపీ రమేష్‌రెడ్డి, ఉప్పల్ సీఐ గోవింద్‌రెడ్డి, డీఐ వెంకటేశ్వర్లతో కలిసి వివరాలను వెల్లడించారు. నల్లగొండ జిల్లా పెద్ద అరిశెల్లపల్లి ప్రాంతానికి చెందిన లోకేష్ కుమార్(27) స్విగ్గీ డెలివరి బాయ్. ఉప్పల్ రామస్వామి ఫంక్షన్ హాల్ విజయపురి కాలనీలో నివాసం ఉంటున్నాడు. సూర్యాపేటకు చెందిన కామిశెట్టి సాయిమౌళి(26) బాల్య స్నేహితులు. చెడు అలవాట్లకు బానిసైన ఇద్దరూ ఆన్‌లైన్ లోన్‌యాప్‌ల నుంచి రుణాలు పొందారు. వాటిని తీర్చడానికి, జల్సాల కోసం చైన్ స్నాచర్స్‌గా అవతారం ఎత్తారు. శివారు ప్రాంతాల్లోని వృద్ధులను టార్గెట్ చేస్తూ స్నాచింగ్‌లకు పాల్పడుతూ వచ్చిన బంగారాన్ని నల్గొండలోని మణప్పురం ఫైనాన్స్‌లో తనఖా పెట్టి ఆ డబ్బులతో జల్సాలకు పాల్పడుతున్నారు. గతంలో ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనాన్ని సైతం దొంగిలించారు. మంగళవారం ఉప్పల్ – నాగోల్ రోడ్డులో వీరిని అదుపులోకి తీసుకుని విచారించారు. రూ.1.80 లక్షల విలువైన నగలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని మంగళవారం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పోచమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

మల్లాపూర్: నాచారం ఎర్రకుంట పోచమ్మ దేవాలయం అభివృద్ధికి సహకారం అందిస్తానని బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజనోఖర్ అన్నారు. పోచమ్మ దేవాలయం గ్రిల్స్ ద్వారం కోసం ఆలయ కమిటీ సభ్యులకు, రూ.30వేల నగదును మంగవారం అందజేశారు. దేవాలయం కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీరామ్ సత్యనారాయణ, నవీన్‌కుమార్, శివకుమార్, దాసరి కర్ణ, శంకర్, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో..



హబ్సిగూడ: తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీవేంకటేశ్వర స్వామిని మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, వంశీ ముదిరాజ్, భరత్‌గౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, సురేష్, భుజేందర్‌గౌడ్, రాచప్ప, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయస్వామి ఆలయంలో పూజలు



మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం గణపతి హోమం, అభిషేకం, ధ్వజారోహణ, పుణ్యావచనం, మండపారాధన, కలశస్థాపన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వై.మల్లేష్, తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, పచ్చిమట్ల నర్సింగ్‌గౌడ్, సాయిగౌడ్, అనిల్, సదానందగౌడ్, ఎస్వీ.ప్రసాద్, కటార్ల వెంకటేష్, ప్రధాన అర్చకులు శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సకల సమస్యలకు పరిష్కార మార్గం

అల్వాల్: డీఎస్‌పీ (దళిత శక్తి ప్రోగ్రాం) ఉద్యమం ప్రశ్నించే గొంతుక కాదని, సమాజంలోని సకల సమస్యలకు పరిష్కార మార్గం చూపించే సమాధాన గొంతుక అని డీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. మంగళవారం అల్వాల్ మండలంలోని బర్షిపేట, కౌకూర్, అల్వాల్, కానాజీగూడ, ఇంద్రనగర్ ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఉద్యమమంటే సకల ప్రశ్నలకు సమాధానం చూపుతుందన్నారు. డీఎస్‌పీ ఉద్యమం రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోని రెడ్డి, రావులకు అణగారిన కులాలకి మధ్య గీత గీసి రాజకీయ యుద్ధం చేయించనుందన్నారు. పాదయాత్రలో భాగంగా శిలాఫలకాలు, డీఎస్‌పీ జెండాలను ఆవిష్కరించారు. డీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా కన్వీనర్ రాజ్‌కమల్, అల్వాల్ మండల కన్వీనర్ హరినాథ్, నాయకులు దినయ్, వివేక్, అరవింద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్‌లో జెండా ఆవిష్కరిస్తూ..

కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గం అల్వాల్, మల్కాజిగిరి మండల పరిధిలోని కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు, జీవో నంబరు 58, 59 లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమం మల్కాజిగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగింది. కార్యక్రమానికి కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్, సునీతాయాదవ్, సబితాకిషోర్, మీనారెడ్డి హాజరై పంపిణీ చేశారు. 228 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 345 మందికి 58 జీవో ప్రకారం పట్టాలు, 59 జీవో ప్రకారం 52 మందికి అందజేశామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మల్కాజిగిరి డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, అల్వాల్ ఇన్‌చార్జి తహసీల్దార్ నిర్మల, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, జీఎస్వీ సతీష్‌కుమార్, గుండా నిరంజన్, పిట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ‘డబుల్’ ఇళ్లు ఇవ్వాలి

మేడిపల్లి: పేదలకు డబుల్ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలమల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చకిషన్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలమల్లేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సర్వే నంబర్-48 భగత్‌సింగ్ నగర్ కాలనీలో పట్టాలు రానివారికి పట్టాలు ఇవ్వాలని, మేడిపల్లి మండలంలో ప్రభుత్వ స్థలాలను కబ్జాదారుల నుంచి కాపాడాలని తదితర డిమాండ్లతో మేడిపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయం



మసీదులో ప్రత్యేక ప్రార్థనలో బీఎల్ఆర్

రామంతాపూర్: రంజాన్ మాసం పురస్కరించుకొని మంగళవారం రామంతాపూర్ ప్రధాన రహదారిలోని కులీ కుతుబ్‌షాహీ మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు బీఆర్ఎస్ రాష్ట్ర నేతల బండారు లక్ష్మారెడ్డి హాజరయ్యారు. మహ్మద్ ప్రవక్త బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమని, రంజాన్ మాసంలో కఠిన ఉపవాస దీక్షలు చేసి ప్రార్థనలు చేసే ముస్లింలపై అల్లా దయ ఎప్పటికీ ఉంటుందన్నారు. జాంగీర్, బాషా, బషీర్, సయీమ్, అక్రమ్, చాంద్, ఉద్దీన్, రకుల్, ఇమ్రాన్, యూసుఫ్ ఉన్నారు.

ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిపై దాడి

- సీసీ కెమెరాలో దాడి దృశ్యాలు
- అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



చికిత్స పొందుతున్న చెట్టుపల్లి శివాజీ

కుషాయిగూడ: ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీపై దాడి జరిగిన ఘటన మంగళవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. లాలాపేట్‌కు చెందిన శివాజీ హెచ్‌బీకాలనీ, కృష్ణానగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో రోడ్డు నెంబరు-5లోని బంధువుల ఇంట్లోకి వెళ్లే సమయంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు బ్యాట్లు, రాడ్లతో శివాజీపై విచక్షణరహితంగా దాడి చేశారు. స్థానికులు అడ్డు తగలడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. తీవ్ర గాయాలపాలైన శివాజీని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. దాడి దృశ్యాలు సమీప సీసీ కెమెరాలో రికార్డ్ అయినట్లు స్థానికులు తెలిపారు. బాధితులు మంగళవారం రాత్రి కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన ఆరె కుల సంఘం ఎన్నికల్లో ఓటమి పాలైన వారే తమపై దాడికి పాల్పడ్డారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు



అల్వాల్: అల్వాల్ హరిదాస మండపం వద్ద 72వ సీతారామ వసంత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం హనుమాన్ అభిషేకం, నాగవల్లి దళార్చన, శ్రీవారికి చందనాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సురేష్, రవి, సంకీర్తన కార్యదర్గ ప్రధాన కార్యదర్శి పరాంకుశం మాధవ్ తదితరులు పాల్గొన్నారు.